సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 19 । మే । 2025



రూ.2 లక్షల విరాళం

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్న ప్రసాద భవన నిర్మాణానికి పి.సూర్యనిఖిల్, హేమలత లక్ష్మీపావని (పశ్చిమ గోదావరి జిల్లా మహదేవపట్నం) రూ.2,00,116 విరాళం సమర్పించారు.




బోధకా... పోరుకు చకచకా

8లో

కూటమి సర్కారు విధానాలకు నిరసనగా బోధకులు పోరుబాట పడుతున్నారు.. సంస్కరణల పేరుతో విద్యా రంగాన్ని బలహీనపర్చేందుకు చేస్తున్న యత్నాలు తిప్పికొట్టాలని ఉద్యమానికి దిగుతున్నారు.

సముద్రంలోకి 8,178 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 8,178 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.50 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

మండు వేసవిలో కరెంట్ కోతలా!

సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు

అమలాపురం టౌన్: జిల్లాలో 132 కేవీ డబుల్ సర్క్యూట్ విద్యుత్ లైన్లకు సంబంధించి 30 టవర్ల మరమ్మతుల పేరుతో ఈ నెల 20 నుంచి జూన్ 5వ తేదీ వరకూ కరెంట్ కోతలు ప్రకటించడం పట్ల సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అమలాపురంలో ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పగలు విద్యుత్ కోతలు అమలు చేయడం పట్ల గృహ వినియోగదారులే కాకుండా ఆక్వా, వ్యవసాయదారులు, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు, ధాన్యం మిల్లులు, తాగునీటి ప్రాజెక్టులు ఇలా పలు రంగాలు ఇబ్బంది పడతాయని ఆయన గుర్తు చేశారు. 30 టవర్ల రిపేర్లతో జిల్లాలోని అమలాపురం పట్టణంతోపాటు 15 మండలాల్లో ఈ విద్యుత్ సరఫరా నిలిపివేత ప్రభావం ఉంటుందన్నారు. నూతన సాంకేతికతతో 10 టవర్ల చొప్పున రిపేర్లు చేపడితే 3 లేదా 4 రోజుల్లో రిపేర్లు పూర్తి చేసే ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని సత్తిబాబు సూచించారు. అవసరమైతే ఇతర జిల్లాల నుంచి టెక్నీషియన్లను అదనంగా రప్పించుకుని పనులు పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించవచ్చన్నారు. ప్రజల సౌకర్యార్థం మూడు రెవెన్యూ డివిజన్లలో 22 మండల కేంద్రాలు, నాలుగు మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్జీదారులు ఆయా స్థాయిల్లో తమ సమస్యలను నమోదు చేసుకుని పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే అడగవచ్చన్నారు. కొత్త ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

కాళేశ్వరం పుష్కరాలకు ప్రత్యేక బస్సులు



కాళేశ్వరం పుష్కరాలకు ప్రత్యేక బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం సత్యనారాయణ మూర్తి

అమలాపురం రూరల్: కాళేశ్వరంలో సరస్వతీ నదీ పుష్కరాలకు జిల్లా నుంచి వెళ్లే భక్తుల సౌకర్యార్థం అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి ఆదివారం రాత్రి ప్రత్యేక బస్సును ప్రారంభించామని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర బస్సు వరంగల్, వేములవాడ, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప దేవాలయాలతో పాటు ముఖ్యంగా సరస్వతి నదిలో పుష్కర స్నానం చేసేటట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, రిజర్వేషన్ కోసం 99592 25576, 99592 25550, అసిస్టెంట్ మేనేజర్ 70138 68687 ఫోన్ నంబర్లను సంప్రదించాలని డీఎం వివరించారు. సూపర్ లగ్జరీ బస్సు టిక్కెట్ ధర రూ.2,200, ఇంద్ర ఏసీ బస్సు టిక్కెట్ ధర రూ.2,700గా నిర్ణయించామన్నారు. బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉంటే వారి గ్రామం నుంచే నేరుగా బస్సును పంపిస్తామని తెలిపారు.

పవర్ ఇబ్బందులు

- ఒకేసారి జిల్లాలో 30 విద్యుత్ టవర్ల పునర్నిర్మాణం
- రేపటి నుంచి వచ్చే నెల 5 వరకూ దశలవారీగా విద్యుత్ కోతలు
- ప్రజలకు, పరిశ్రమలకు కష్టాలు



రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు వద్ద కొత్త టవర్ల ఏర్పాటుకు మెటీరియల్ పరిశీలిస్తున్న విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది

కొత్తపేట: సూరీడు నిప్పులు కురిపిస్తున్నారు... ఇంటి నుంచి బయటకు వస్తే సలసల మండిస్తున్నాడు... ఒక్క క్షణం కరెంట్ లేకపోతే ఉక్కబోత పుట్టిస్తున్నాడు. ఇప్పుడేమో జిల్లాలో విద్యుత్ కోతలు అమలు కానుండడంతో ప్రతి జీవీ అల్లాడుతోంది. జిల్లాలో విద్యుత్ టవర్ల పునర్నిర్మాణ పనుల నేపథ్యంలో ఈ అంతరాయం నెలకొంటుంది. ఇక్కడి 132 కేవీ రామచంద్రపురం నుంచి 132 కేవీ అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, రాజోలు వరకూ ఉన్న డబుల్ సర్క్యూట్ లైన్లకు సంబంధించి 30 టవర్ల పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. వీటి నిర్మాణానికి సుమారు రూ.2 కోట్ల నిధులు గత ప్రభుత్వంలోనే మంజూరు కాగా, ఏకకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులు చూస్తున్నారు. మొత్తం 17 రోజుల పాటు ఈ పనులు జరగనున్న నేపథ్యంలో.. ఎక్కువ రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తే ఎలాగని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో ఒక టవర్ కుప్పకూలడంతో అత్యవసరంగా ఈ పనులు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించి ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వం అనుమతులు తీసుకున్నారు. ఆ మేరకు ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ ఎ.గురుబాబు, ఈఈ ఆర్‌వీ శ్రీధర్, డీఈఈ జీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పాడైన 30 టవర్ల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ 132 కేవీ అమలాపురం, కొత్తపేట, రాజోలు, ముమ్మిడివరం పరిధిలోని ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అమలాపురం మున్సిపాలిటీ, అమలాపురం రూరల్, అల్లవరం, అంబాజీపేట, అయినవిల్లి, కొత్తపేట, రావులపాలెం, రాజోలు, మామిడికుదురు, పి.గన్నవరం, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు దశలవారీగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ (ఆపరేషన్ సర్కిల్) ఎస్ఈ ఎస్.రాజబాబు ఇప్పటికే ప్రకటించారు.

నష్టాలు.. కష్టాలు

సుమారు 17 రోజులపాటు వర్కింగ్ అవర్స్‌లో విద్యుత్ సరఫరా దశల వారీగా నిలిపివేయడంతో ప్రజలతో పాటు చిన్న, పెద్ద తరహా పరిశ్రమలు, వ్యాపార, వ్యవసాయ రంగ సంస్థలకు కష్టాలు ఎదురుకానున్నాయి. ఏసీలు, ఫ్యాన్లకు అలవాటుపడిన జనం వేసవి ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయికి చేరుకున్న నేపథ్యంలో కరెంట్ లేకపోతే విలవిల్లాడిపోతున్నారు. అలాగే జిల్లాలో ముఖ్యంగా కొబ్బరి ఆధారిత పరిశ్రమలు, రైస్ మిల్లులు, సీఫుడ్స్ పరిశ్రమలు, ఐస్ ఫ్యాక్టరీలు, కూల్ డ్రింక్ షాపులు, బేకరీలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, హోటల్స్, రెస్టారెంట్స్, ఆర్ఓ ప్లాంట్స్ తదితర సర్వం సంస్థలన్నీ విద్యుత్‌పై ఆధారపడి పనిచేస్తున్నవే. చేపలు, రొయ్యల చెరువులు, కంద, పసుపు, పువ్వులు తదితర ఉద్యాన పంటలు విద్యుత్ మోటార్లపై ఆధారపడినవే. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అత్యధిక సమయం విద్యుత్ అంతరాయం ఏర్పడితే తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని యాజమాన్యాలు వాపోతున్నాయి.



అయినవిల్లి సమీపంలో పాడైన టవర్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

గతమెంతో ఘనం

పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా విద్యుత్ సరఫరాకు ఏవిధమైన అంతరాయం లేకుండా జిల్లాలో 132 కేవీ సబ్ స్టేషన్ల ఆధునీకరణ, అదనంగా 33 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం, పాత సబ్ స్టేషన్లలో ఎక్కువ ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, గ్రామాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు సమకూర్చింది. అలాగే సుమారు 50 ఏళ్ల కిందట నిర్మించిన టవర్లలో పాడైనవి మార్చేందుకు చర్యలు తీసుకుంది. ప్రజలకు విద్యుత్ కష్టాలు లేకుండా అత్యవసరంగా మార్చాల్సిన టవర్స్ స్థానంలో కొత్తవి నిర్మించింది. జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అయినవిల్లి వద్ద రూ.200 కోట్లతో 400/132 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేసింది. ఆ మేరకు 2023 నవంబర్ 28న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుంది.

పగలు లేకుంటే నష్టమే..



వ్యాపార సముదాయాలున్న మండల కేంద్రాలు, పెద్ద గ్రామాలకు ఎక్కువ సమయం విద్యుత్ సరఫరా చేయాలి. విద్యుత్‌పై ఆధారపడి వ్యాపార సంస్థలు ముఖ్యంగా హోటల్స్ నిర్వహిస్తున్నాం. పగటి పూట 12 గంటల్లో అత్యధిక సమయం కరెంట్ లేకపోతే తీవ్రంగా నష్టపోతాం. ఆ పరిస్థితి రాకుండా అధికారులు చూడాలి.

–మల్లిడి ప్రభాకరరెడ్డి, హోటల్ యజమాని, రావులపాలెం

రోజుకు రెండు టవర్ల నిర్మాణం



మొత్తం 30 టవర్ల నిర్మాణం 15 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ మేరకు చెన్నై, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి ఒక టీమ్‌కు 25 మంది చొప్పున రెండు టీమ్‌లను తీసుకువచ్చారు. వీరు రోజుకు రెండు టవర్ల చొప్పున నిర్మిస్తారు. కార్మికులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిరంతరాయంగా పని చేసేలా చూస్తాం. సాయంత్రం 7 గంటల లోపే విద్యుత్తు సరఫరా ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

–ఎస్.రాజబాబు, ఎస్ఈ, ఆపరేషన్ సర్కిల్, ఏపీఈపీడీసీఎల్, కోనసీమ జిల్లా

ఉండి నుంచి విద్యుత్ సరఫరా

జిల్లాకు రోజుకు 180 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, ప్రస్తుతం టవర్ల పునర్నిర్మాణం నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా ఉండి గ్రామ 220 ఎస్ఎస్ సబ్ స్టేషన్ నుంచి సింగిల్ సర్క్యూట్ లైన్ ద్వారా వయా భీమవరం మీదుగా రాజోలు 132 కేవీ సబ్ స్టేషన్‌కు సుమారు 100 మెగావాట్ల విద్యుత్ దిగుమతి చేసుకుంటారు. అక్కడి నుంచి అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం 132 కేవీ సబ్ స్టేషన్లకు సరఫరా ఇస్తారు. మిగిలిన 80 మెగావాట్స్ విద్యుత్ లోటును లోడు రిలీఫ్ (ఎల్ఆర్) రూపంలో నాలుగు సబ్ స్టేషన్లకు సర్దుతారు. ఫలితంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ రొటేషన్ విధానంలో దశల వారీగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

ఒకేసారి పనులకు..

ప్రస్తుతం పాడైన పాత టవర్ల స్థానే కొత్తవి ఏర్పాటు చేసేందుకు ట్రాన్స్‌కో అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. 132 కేవీ రామచంద్రపురం నుంచి 132 కేవీ అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రాజోలు డబుల్ సర్క్యూట్ లైన్లకు సంబంధించి సుమారు 100 టవర్లు ఉన్నాయి. ఇందులో చాలా వరకూ సుమారు 50 ఏళ్ల కిందట నిర్మించినవే. సుమారు 70 టవర్లను దశలవారీగా మార్చారు. ఇంకా 30 టవర్లను మార్చాల్సి ఉంది. అవి దాదాపు తుప్పుపట్టి పాడైపోయాయి. పలు టవర్లు ఎప్పుడు కుప్పకూలుతాయో అన్నట్టు ఉన్నాయి. ఇలా గత నెల 16న కోటిపల్లి- కె.గంగవరం మధ్య టవర్ కుప్పకూలింది. దీనివల్ల జిల్లా ప్రజలు నాలుగు రోజులపాటు విద్యుత్ కష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీంతో ఎమర్జెన్సీ ఆపరేషన్‌గా పరిగణించి ఈ వేసవి సీజన్‌లోనే మొత్తం 30 టవర్ల పునర్నిర్మాణం ఒకేసారి చేపట్టారు.

ఎయిడ్స్ మృతులకు కొవ్వొత్తులతో నివాళి



అమలాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి భరతలక్ష్మి తదితరులు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలాపురం హైస్కూల్ సెంటర్ నుంచి గడియారం స్తంభం వరకూ ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తొలుత దీనిని జిల్లా కుష్టు వ్యాధి, ఎయిడ్స్ అండ్ టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఎయిడ్స్‌తో చనిపోయిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అలాగే హెచ్‌ఐవీతో జీవిస్తున్న రోగులకు అండగా నిలుస్తూ సంఘీభావం ప్రకటించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖతోపాటు వైద్యులు, సిబ్బంది, జిల్లా ప్రజలు అండగా నిలుస్తారని భరతలక్ష్మి తెలిపారు. గడియార స్తంభం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ నివారణ అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారి పట్ల వివక్ష వద్దని సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ ఎ.బుజ్జిబాబు, ఏఆర్‌టీ వైద్యాధికారులు, జిల్లా టీబీ నియంత్రణ సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సిబ్బంది, కోస్టల్ పాజిటివ్ పీపుల్ సంస్థ సిబ్బంది, ఐసీటీసీ అండ్ డీఆర్‌ఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

శతావధాని బాలభానుకు డాక్టరేట్

అమలాపురం రూరల్: భట్నవిల్లి గ్రామానికి చెందిన అధ్యాపకురాలు, ప్రథమ మహిళా శతావధాని ఆకెళ్ల బాలభానుకు ఢిల్లీలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. బాలభాను ఇప్పటికే దేశవిదేశాల్లో 215 అష్టావధానాలు, మూడు శతావధానాలు, ఒక ద్విశతావధానం చేశారు. అమెరికాలో అవధానం చేసిన మొదటి మహిళ ఈమె. ఆమె కృషిని గుర్తించి డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ అండ్ చారిటీ వారు ఇంటర్నేషనల్ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆదివారం న్యూఢిల్లీలో డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దోమన చిన్నారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ ఆలపాటి లక్ష్మీనారాయణ, సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఎస్‌కే రెహమాన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ దాడి సత్యనారాయణ, తదితరులు బాలభానుకు డాక్టరేట్ అందించారు.



బాలభానుకు డాక్టరేట్ అందిస్తున్న చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తదితరులు

శిక్షణతో ఆంగ్ల బోధన సులభం

అల్లవరం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆంగ్లభాషను సులభంగా బోధించేందుకు ఉచిత శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని విల్2కేఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ అన్నారు. అల్లవరం మండలం ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్లభాషపై ఉచిత శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 500 మంది ఉపాధ్యాయులు హాజరై మెళకువలు నేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలనే ఉద్దేశంతోనే తాను ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మందికిపైగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు. త్వరలో మిగిలిన జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు ఆంగ్ల భాషపై నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా విద్యార్థుల స్థాయికి తగినట్లు బోధించవచ్చన్నారు. ఈ తరగతుల నిర్వహణకు అవకాశమిచ్చిన డీఈఓ డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు, బీవీసీ యాజమాన్యానికి రామేశ్వర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రామేశ్వర్ గౌడ్‌ను సత్కరించారు.

చలివేంద్రం మళ్లీ ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్..

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ గ్రామ పంచాయతీ వద్ద శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్భాటంగా చలివేంద్రం ప్రారంభించారు. అది గంటలోనే మూసివేయడంపై 'సాక్షి'లో 'గంటలో చల్లాచెదురు' అనే శీర్షికన ఆదివారం వచ్చిన వార్తకు ద్రాక్షారామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ స్పందించారు. పంచాయతీ గేటు వద్ద చిన్న మట్టికుండతో మంచినీరు ఏర్పాటు చేసి 'సాక్షి'కి సమాచారం ఇచ్చారు. బాటసారులకు కూలింగ్ వాటర్ టిన్నులతో మంచినీరు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ద్రాక్షారామ పంచాయతీ వద్ద ఆదివారం మళ్లీ ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఏపీ ఈఏపీ సెట్‌కు అంతా రెడీ

- నేడు, రేపు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ





రాయవరం: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీ సెట్–2025) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కాకినాడ జేఎన్‌టీయూ భాగస్వామ్యంతో ఏపీ ఈఏపీ సెట్ నిర్వహిస్తున్నారు. ఏపీ ఈఏపీ సెట్ (పాత ఎంసెట్)లో భాగంగా సోమ, మంగళ వారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుండగా, ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరుపుతారు. దీనికోసం జిల్లాలో అమలాపురం భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామ పరిధిలో శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఒక్కో విడత ఆన్‌లైన్‌పరీక్షకు 200 మంది వరకూ విద్యార్థులను కేటాయించారు. ఈ విధంగా రోజుకు 800 మంది విద్యార్థులు జిల్లాలో పరీక్షకు హాజరు కానున్నారు.

రెండు షిఫ్ట్‌లుగా..

కంప్యూటర్ బేస్ట్ విధానంలో పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే పరీక్షలు ఉదయం మొదటి షిఫ్ట్ 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తారు. విద్యార్థులు కనీసం గంటన్నర ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 2 గంటలకు కచ్చితంగా ఆన్‌లైన్లో పరీక్షను ప్రారంభించాల్సి ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిబంధనల్లో పొందుపర్చింది. జిల్లాలో అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు 5,631 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలకు 1,596 మంది, ఇంజినీరింగ్ పరీక్షలకు 4,130 మంది, రెండు పరీక్షలకు ఆరుగురు హాజరు కానున్నారు. కాగా ఏపీ ఈఏపీ సెట్ ద్వారా విద్యార్థులకు ఇంజినీరింగ్ (బీటెక్), బయోటెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బీఎస్సీ (అగ్రికల్చర్), హార్టీకల్చర్, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండరీ, బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్, బీ ఫార్మసీ, ఫార్మ్.డి కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు గంటన్నర ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చాం.

–వీవీ సుబ్బారావు, కన్వీనర్, ఏపీ ఈఏపీ సెట్, జేఎన్‌టీయూ, కాకినాడ

పది సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

నేటి నుంచి 26 వరకూ పరీక్షలు

పరీక్ష కాలం

రాయవరం: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారికి నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో మాదిరిగా కాకుండా సప్లిమెంటరీ విద్యార్థులను కూడా రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణించనున్నారు. జిల్లాలో 10 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో 18,871 మంది విద్యార్థులు ఈ ఏడాది ఏప్రిల్ మూడు నుంచి జరిగిన పది పరీక్షలకు హాజరు కాగా, 17,253 మంది ఉత్తీర్ణత సాధించారు. 1,618 మంది వివిధ సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు. వీరితో పాటు 213 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసే వారిలో గణితంలో అత్యధికంగా 1,024 మంది ఉండగా, అత్యల్పంగా హిందీ పరీక్షకు 130 మంది హాజరు కానున్నారు. వీరికి అమలాపురం డివిజన్‌లో 5, రామచంద్రపురం డివిజన్‌లో మూడు, కొత్తపేట డివిజన్లలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్ తదితర వాటిని కల్పించారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లను అందించారు. పరీక్ష కేంద్రాల్లో ఇబ్బంది రాకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, డీఓలు, ఇన్విజిలేటర్లు పర్యవేక్షించనున్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నేతృత్వంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ డాక్టర్ షేక్ సలీం బాషా సాక్షికి తెలిపారు.



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు

సదుపాయాలకు ప్రాధాన్యం



పది సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి జిల్లాలో ఏర్పాటు చేసిన 10 పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా ఫర్నీచర్, తాగునీరు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం.

–డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈఓ, అమలాపురం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న కారు: ఇద్దరికి తీవ్రగాయాలు



కోదండరామపురం వద్ద బైక్‌ను ఢీకొన్న కారు

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని కోదండరామపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పిఠాపురం నుంచి సామర్లకోట వస్తున్న బైక్‌ను ఎదురుగా వెళ్తున్న కారు ఢీకొంది. దాంతో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తీసుకెళ్లేందుకు 108 సకాలంలో రాకపోవడంతో స్థానికుల సహాయంతో ప్రైవేటు వాహనంలో పిఠాపురంలో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బైక్ పూర్తిగా ధ్వంసమైంది.

పాము కాటుకు వృద్ధురాలి మృతి



పెదలక్ష్మి (ఫైల్)

అల్లవరం: మండలంలోని గుండెపూడి పంచాయతీ పోతులవారిపేటకు చెందిన జంగా పెదలక్ష్మి (67) పాము కాటుకు గురై మృతి చెందింది. శనివారం రాత్రి ఇంటి ఆవరణలో స్నానం చేస్తుండగా పాము కరిచింది. కాసేపటికి కాలు బరువు ఎక్కడంతో కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు అల్లవరం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు.

బోధకా... పోరుకు చకచకా

- ఉపాధ్యాయుల ఉద్యమబాట
- ఐక్యవేదికగా తొమ్మిది సంఘాలు
- 21న జిల్లా విద్యాశాఖ కార్యాలయాల ముట్టడి



కాకినాడలో సమావేశమైన ఐక్యవేదిక నాయకులు

రాయవరం: కూటమి సర్కారు విధానాలకు నిరసనగా బోధకులు పోరుబాట పడుతున్నారు.. సంస్కరణల పేరుతో విద్యా రంగాన్ని బలహీనపర్చేందుకు చేస్తున్న యత్నాలు తిప్పికొట్టాలని ఉద్యమానికి దిగుతున్నారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ పేరుతో చేపడుతున్న ప్రక్రియను మొదటి నుంచీ ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఉపాధ్యాయ సమస్యలపై గత 30 వారాలుగా పాఠశాల విద్యాశాఖ గుర్తింపు పొందిన సంఘాలతో చర్చించిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా వ్యతిరేకంగా జీఓలు విడుదల చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు దుయ్యబడుతున్నాయి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు రకాల పాఠశాలలను, ప్రస్తుత ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలుగా ప్రతిపాదించి, అమలు చేయడానికి పూనుకోవడం ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనన్న విమర్శలు ఉపాధ్యాయుల నుంచి, ఉపాధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తోంది. తెలుగు భాష కలిగిన రాష్ట్రంలో తెలుగు మీడియం లేకుండా ఇంగ్లిష మీడియం మాత్రమే ప్రవేశ పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంఘాలు ఖండిస్తున్నాయి.

దశలవారీ పోరాటాలకు..

తాము లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం జీఓలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయి. ఈ నెల 16న పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించి, 16 డిమాండ్లతో కూడిన నోటీసును రాష్ట్ర విద్యాశాఖకు అందజేశాయి. యూటీఎఫ్, ఎస్టీయూ, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్257, ఏపీటీఎఫ్1938, ఏపీపీటీఏ, ఏపీయూఎస్, ఏపీహెచ్ఎంఏ, వైఎస్ఆర్‌టీఏ వంటి గుర్తింపు పొందిన సంఘాలు ఐక్యవేదికగా ఏర్పడ్డాయి. దశలవారీ పోరాటం చేయాలని నిర్ణయించాయి. అందులో భాగంగా ఈ నెల 21న ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు, 23న రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చాయి.

ధర్నా విజయవంతానికి కార్యాచరణ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొమ్మిది రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక కాకినాడ ఎస్టీయూ భవన్‌లో సమావేశమై ధర్నా విజయవంతానికి కార్యాచరణ రూపొందించింది. ఈ నెల 21న ఉదయం తొమ్మిది గంటలకు ఐదు వేల మంది ఉపాధ్యాయులతో కాకినాడ జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించాలని నిర్ణయించింది. ఇదిలా ఉంటే రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయ సంఘాలతో సోమవారం 10 గంటలకు చర్చలకు పిలిచారు. ఈ చర్చలు ఫలప్రదమైతే ధర్నాను విరమించాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేయాలని ఐక్య వేదిక తీర్మానించింది.

డిమాండ్లివీ..

- ఉన్నత పాఠశాలల్లో 1:35 నిష్పత్తి ప్రకారం 45 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలి.
- మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్ల నియామకం అశాస్త్రీయం.
- సమాంతర మీడియం, మైనర్ మీడియాలను కొనసాగించి, స్టాఫ్ పాటర్న్‌ను కొనసాగించాలి.
- స్టడీ లీవ్‌లో ఉన్నవారి స్థానాలను ఖాళీలుగా చూపించకూడదు.
- ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో 41 రోల్ వద్ద మూడో పోస్టు ఇవ్వాలి.
- పీహెచ్ కోటాలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వారికి ప్రాథమిక పాఠశాలల్లో 40 శాతం, ఉన్నత పాఠశాలల్లో 50 శాతం ఖాళీలను మాత్రమే ఎంపిక చేసుకోవాలనే నిబంధనను తొలగించాలి.

ఒక్క పోస్టు కూడా బ్లాక్ చేయమని హామీ ఇచ్చి, మార్గదర్శకాల్లో పోస్టులను బ్లాక్ చేయడం సరైన విధానం కాదు.

- మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు ఇచ్చి ప్రధానోపాధ్యాయులను నియమించాలి.
- ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి అమలు చేయాలి.
- పలు దఫాలుగా రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులకు 8 సంవత్సరాల పాయింట్లు కేటాయించాలి.
- పీహెచ్ కోటా వారిని యథాస్థితిలో ఉంచమని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినందున వారు రేషనలైజేషన్‌లో ఉన్నప్పుడు వేరే వారిని రేషనలైజేషన్ చేయడం సరికాదు.
- ప్రభుత్వ, పంచాయతీరాజ్ సర్వీస్ రూల్స్ సమస్య తేలకుండా ఎనిమిదేళ్ల లాంగ్ స్టాండింగ్ అయిన వారిని సొంత యాజమాన్యానికి వెళ్లమనడం ఆపాలి.
- రేషనలైజేషన్‌లో సీనియర్ విల్లింగ్ ఇస్తే పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలి.
- ఎస్జీటీలకు ఆన్‌లైన్‌తో కూడిన మాన్యువల్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలి.
- ప్రతి ఏటా రేషనలైజేషన్ ప్రక్రియ లేకుండా చూడాలి.
- ఎంఈఓలకు బదిలీలు చేపట్టాలి. కోరుకున్న ఎంఈవో-1, ఎంఈవో-2లకు హెచ్ఎంలుగా కన్వర్షన్ ఇవ్వాలి.

వేలాది మంది వచ్చేలా..



ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు దశలవారీ పోరాటం చేస్తున్నాం. అందులో భాగంగా ఈ నెల 21న ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. వేలాదిగా ఉపాధ్యాయులు తరలి వచ్చేందుకు కార్యాచరణ చేపడుతున్నాం.

– పి.సురేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

న్యాయమైన కోర్కెల సాధనకు..



కొంతకాలంగా ఉపాధ్యాయ సంఘాల నుంచి తీసుకున్న ఏ ఒక్క వినతిని సానుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన అంశాలను పక్కన పెట్టి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగు మీడియం ఉండాలన్న ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్, ఇప్పుడు తీసేయడం శోచనీయం.

– పోతంశెట్టి దొరబాబు, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ

అసంబద్ధ నిర్ణయాలు సరికావు



ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలను మాత్రమే వ్యతిరేకిస్తున్నాం. ముఖ్యంగా ఒక్కో పాఠశాలలో ఒక్కో విధంగా నిర్ణయించిన ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిలను మార్పు చేయాలి. స్కూల్ అసిస్టెంట్లను మోడల్ స్కూల్ హెచ్ఎంలుగా నియమించడం సరికాదు. ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి, మోడల్ స్కూల్ హెచ్ఎంలుగా నియమించాలి.

– దీపాటి సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఆర్‌టీయూ

అలుపెరుగని పరుగు

- ఆరు పదులకు చేరువైనా అదే ఉత్సాహం
- ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపిక
- పతకమే లక్ష్యమంటున్న నాగబాబు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల స్థాయిలో మొదలైన ఆయన పరుగు...ఉద్యోగిగా మారినా ఆగలేదు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభను చూపి పతకాలు దక్కించుకున్నాడు. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఈ ఏడాది హైదరాబాద్‌లో జరిగే 23వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. ఈ సంవత్సరం కర్ణాటక, రాజస్థాన్‌లో జరిగిన పోటీలలో పాల్గొని బంగారు, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు. కాకినాడ వైద్య ఆరోగ్య కార్యాలయంలో మలేరియా విభాగంలో సబ్‌యూనిట్ ఆఫీసర్‌గా సేవలు అందిస్తున్న యాతం నాగబాబుకు పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తి. అదే అతనిని జాతీయస్థాయిలో మెరిసేలా చేసింది.

రాపర్తి నుంచి...

1967 సంవత్సరంలో పిఠాపురం మండలం రాపర్తిలో జన్మించిన నాగబాబు విద్యాభ్యాసం రాపర్తి, జల్లూరు గ్రామాలలో సాగింది. జల్లూరు, మల్లాంలో ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తిచేశాడు. పెద్దాపురం మహారాణి కళాశాలలో చదువుకున్నాడు. చదువుకునే రోజుల్లోనే పాఠశాల, కళాశాల తరఫున క్రీడల్లో రాణించి ఎన్నో పతకాలు, ప్రశంసలు పొందాడు. క్రీడలతో పాటు చదువులోను, ఎన్.ఎస్.ఎస్. సభ్యుడిగా గ్రామీణ ప్రాంతాలలో సేవా కార్యక్రమాల్లోనూ ముందుండేవాడు. తర్వాత వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగం వచ్చింది. క్రీడల్లో రాణిస్తున్నా ఉద్యోగాన్నీ అశ్రద్ధ చేయలేదు. విధి నిర్వహణలో అతని అంకితభావాన్ని గుర్తించి వైద్య ఆరోగ్య శాఖ ఉత్తమ పురస్కారాన్ని అందించింది.

సాధించిన విజయాలు

2013 నుంచి 2024 వరకు జరిగిన వివిధ ఆలిండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో ఓపెన్ మీట్‌లో పరుగు పందెం 200, 400, 800, 15,500 మీటర్ల వివిధ విభాగాలలో పాల్గొని 60 పతకాలు (బంగారు 15, వెండి 20, కాంస్య 25) సాధించాడు. ఫిబ్రవరిలో రాజస్థాన్‌లోని రాజర్షి కాలేజీ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో 6 పతకాలు కైవసం చేసుకున్నాడు. ఏప్రిల్‌లో కర్ణాటకలో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లోనూ 3 పతకాలు అందుకున్నాడు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్, రూరల్ ఎమ్మెల్యే నానాజీ నాగబాబును అభినందించి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. నాగబాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకం సాధిస్తానన్నారు. తద్వారా ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికవుతానని ఆత్మ విశ్వాసం వ్యక్తం చేశారు. క్రీడాకారుడిగా తాను సాధించిన విజయాలను గుర్తించి ప్రభుత్వం తరఫున క్రీడాకారులకు అందించే ప్రోత్సాహకాలు తనకూ అందించాలని కోరారు.



నాగబాబును అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, చిత్రంలో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ (ఫైల్)



అథ్లెట్ నాగబాబును అభినందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్ (ఫైల్)

బంగారు పాదుకల సమర్పణ



బంగారు పాదుకలను ఆలయ ఈఓకు అందజేస్తున్న దాత వెంకట సూర్యసుబ్బరాజు దంపతులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయంలో స్వామివారికి కొత్తపేటకు చెందిన మంతెన వెంకట సూర్యసుబ్బరాజు, శ్వేత దంపతులు ఆదివారం బంగారు పాదుకలు సమర్పించారు. వీటిని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజుకు ఇచ్చారు. దీని విలువ రూ.30 లక్షలు ఉంటుందని ఈఓ తెలిపారు. పాదుకలకు అర్చక స్వాములు సంప్రోక్షణ నిర్వహించారు. దాతను శేష వస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

కిటకిటలాడిన విఘ్నేశ్వరుని సన్నిధి



విఘ్నేశ్వరుని ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, గరిక పూజ జరిపారు. స్వామివారిని వివిధ పుష్పాలతో అర్చకులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభి షేకాల్లో 39 మంది, లక్ష్మీగణపతి హోమంలో 19 జంటలు, స్వామివారి గరిక పూజలో మూడు జంటలు పాల్గొన్నాయి. ఎనిమిది మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, ఏడుగురికి అన్నప్రాశన, 18 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2,500 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్కరోజు ఆలయానికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,18,140 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

ఉన్నత పాఠశాలలో చోరీ



శంఖవరం జెడ్పీ హైస్కూల్‌లో కంప్యూటర్ గదిని పరిశీలిస్తున్న పోలీసులు

శంఖవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ పాఠశాలలో గత శుక్రవారం వరకూ ఉపాధ్యాయులు, సిబ్బంది విధులు నిర్వహించారు. శనివారం గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోకి చొరబడి రూ.3 లక్షల విలువైన కంప్యూటర్లు, ఇతర సామగ్రి చోరీ చేశారు. స్థానిక విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలోకి ఆటలు ఆడుకోవడానికి వెళ్లారు. పాఠశాల కంప్యూటర్ గది తెరిచి ఉండడంతో లోపలకు వెళ్లి చూడగా కంప్యూటర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ సమాచారాన్ని ఎంఈఓ ఎస్‌వీ రమణకు తెలిపారు. ఎంఈఓ, ప్రధానోపాధ్యాయురాలు టి.భాస్కరలక్ష్మి ఫిర్యాదు మేరకు అన్నవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

సపర్యలు చేసి.. సాయంగా నిలిచి



చికిత్స పొందిన తరువాత వృద్ధురాలు



బొమ్మూరులో వృద్ధురాలికి సపర్యలు చేస్తున్న జీఎంఎస్‌కే, సామాజిక కార్యకర్తలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జాతీయ రహదారి పక్కన మండుటెండలో ఒంటిపై ఎటువంటి దుస్తులు లేకుండా దుప్పటి కప్పుకుని అచేతన స్థితిలో ఉన్న వృద్ధురాలికి జీఎంఎస్‌కే, సామాజిక కార్యకర్తలు సపర్యలు చేశారు. అంతేకాకుండా ఆమెను ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించి ప్రాణం నిలిపిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మూరు జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంకు సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలు (60) ఒంటిపై దుస్తులు లేకుండా దుప్పటి కప్పుకుని అపస్మారక స్థితిలో పడిఉంది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బొమ్మూరు గ్రామ సచివాలయం-3 మహిళా సంరక్షణ కార్యదర్శి చాందిని, సామాజిక కార్యకర్తలు రసూల్‌భాయ్, భానులు సంఘటనా స్థలానికి చేరుకుని సపర్యలు చేశారు. వృద్ధురాలికి తాగునీరు, ఓఆర్ఎస్ పట్టించి దుస్తులు వేసి 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్స్‌తో రసూల్‌భాయ్ వెళ్లి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించేవరకూ అక్కడే ఉన్నారు. దీంతో ఆ వృద్ధురాలు ప్రాణాపాయం నుంచి బయటపడింది. బొమ్మూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ భీమేశ్వరరావు సైతం సహకరించారు. తన పేరు విజయలక్ష్మి అని, రాజమహేంద్రవరం వాసినని ఆ వృద్ధురాలు చెబుతుంది.

విస్తృతంగా వాహనాల తనిఖీలు



విద్యార్థుల వాహనాల విషయంలో సూచనలు చేస్తున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: రహదారి భద్రతపై అవగాహనలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకూ ఐదు కళాశాలల పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి, నిబంధనల ఉల్లంఘన కింద 106 మంది విద్యార్థుల మోటార్ సైకిళ్లను సీజ్ చేశామని కోనసీమ జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్ఓడీలతో సమావేశాలు నిర్వహించి రహదారి భద్రతపై విద్యార్థుల విషయంలో తీసుకునే ముఖ్యమైన అంశాలను తెలిపామన్నారు. ఇక నుంచి సీజ్ చేసిన విద్యార్థి బైక్ విడుదలకు.. విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా ఆర్టీఏ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని కౌన్సెలింగ్ ఇచ్చిన తరువాతే విడుదల చేస్తామని డీటీఓ తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఏ ఒక్క విద్యార్థి ప్రాణం పోకుండా ఉండాలన్నదే తమ ధ్యేయమని అన్నారు. కళాశాలలు తెరిచే నాటికి విద్యార్థులు లెర్నర్ లైసెన్స్ పొంది ఉండాలని విజ్ఞప్తి చేశారు. భద్రత, ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదని తెలిపారు. తల్లిదండ్రుల పాత్ర, బాధ్యతపై ఎటువంటి సందేహాలున్నా నేరుగా తన ఫోన్ నంబరు 91542 94209కు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: తిమ్మాపురం వై.జంక్షన్ వద్ద ఈ నెల 16న తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా తిమ్మాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి బంధువులు శనివారం కాకినాడ టూ టౌన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసుల సూచన మేరకు జీజీహెచ్‌కు వారు వెళ్లి పరిశీలించగా, కాకినాడకు చెందిన సాధనాల అప్పన్న (50)గా గుర్తించారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటన జరిగిన రెండు రోజుల ముందు ఇంటి వద్ద అప్పన్న గొడవ పడి బయటకు వెళ్లినట్లు పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య సింహాచలం ఫిర్యాదు మేరకు ఎస్సై మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ కౌలురైతు మృతి

కరప: సాగు కలిసిరాక, చేసిన అప్పులు తీర్చలేక మద్యానికి బానిసైన ఒక కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడి, చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ శివారు పోటినాటివారి వీధికి చెందిన పోలినాటి హరిబాబు (38)కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. హరిబాబు వేములవాడ గ్రామానికి చెందిన కోన లావణ్య పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అతను సాగు నిమిత్తం రూ.4 లక్షల అప్పు చేశాడు. వ్యవసాయంలో రాబడి రాక, చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో 17న ఉదయం హరిబాబు మద్యంకోసం తన భార్యను డబ్బులు అడగ్గా లేవని చెప్పడంతో, భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం హరిబాబు క్షణికావేశంలో గడ్డిమందు తాగాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కరప ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ నలుగురూ ఏంటీ!



బొమ్మూరు వద్ద జాతీయ రహదారిపై స్కూటీపై నలుగురు మహిళల ప్రయాణం

మానవ తప్పిదాలతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి.. అవి మనం నిత్యం చూస్తున్నాం.. అయినా అదే నిర్లక్ష్యం. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు జాతీయ రహదారిపై స్కూటీపై నలుగురు మహిళలు ఇలా రయ్‌మంటూ వెళ్లారు. స్కూటీపై ముగ్గురు కూర్చోగా మరో యువతిని ఒళ్లో కూర్చోపెట్టుకున్నారు. దీనికితోడు హెల్మెట్ కూడా పెట్టుకోలేదు. వీరిని చూసిన వారందరూ ముక్కున వేలేసుకున్నారు. జరగరానిది జరిగితే ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ మహిళలు సైతం నిబంధనలు బేఖాతర్ చేయడంపై విమర్శలు గుప్పించారు.

– రాజమహేంద్రవరం రూరల్